

# ఉద్యోగం

అంబటిపూడి లక్ష్మీరమణ

**"రామకృష్ణ,** ఎం.ఏ.,
**ఆంధ్రోపన్యాసకులు,
ప్రభుత్వకళాశాల."**

నేమ్ ప్లేట్ చూచి నా జేబులో నున్న విజిటింగ్ కార్డులోని అడ్రసుతో సరిపోల్చుకుని, నాకు కావలసిన, నేను రావలసిన అడ్రసు ఇదేనని దృఢపరచుకొని, కాంపౌడ్‌వాల్ గేటు తెరుచుకొని లోపలికి వెళ్ళాను. వరండా గ్రిల్ డోర్ మూసివేసి ఉంది.

కాలింగ్‌బెల్ నొక్కుదామని చెయ్యి ఎత్తానో లేదో, లోపలి నుంచి గిన్నెలు, చెంబులు, తప్పాళాలు మొదలైన వాటితో కూర్చిన కర్ణపేయమైన సంగీతం వినిపించడంతో ఉలిక్కిపడి ఎత్తిన చెయ్యిదించి వీపు చరుచుకున్నాను. ఎంతో అనుభవజ్ఞుడైన సంగీత దర్శకుడైనా, ఆ ఇన్‌స్ట్రుమెంట్సుతో యింత గొప్ప సంగీతాన్ని అందించలేడేమోననిపించింది.

ఇంతలో ఒక నారీరత్నం గొంతు స్టీరియోఫోనిక్ సౌండ్‌ట్రాక్ నుండి వినిపించినంతగా, లయబద్ధంగా వినిపించసాగింది. "ఛీ... ఛీ... నేరకపోయి ఈయన్ని కట్టుకున్నాను. భార్యమాట కించిత్తయినా వింటాడన్న ఆశ లేదు గదా! ఇటువంటి మనిషని తెలిస్తే అసలీయన్ని పెళ్ళాడేదాన్నేకాదు. హుం...నాఖర్మ కొద్దీ చేసుకున్నాను."

ఇప్పుడర్థమైంది. ఇందాకటి ఆకర్ణపేయమైన సంగీతకర్త ఈ స్త్రీమూర్తి అయివుంటుందని; మన రామకృష్ణగారి ధర్మపత్ని కూడా అయివుంటుందని.

"నేనేమన్నా మేడలడిగానా? మిద్దెలడిగానా? అసలు నా మాటంటేనే గిట్టదాయనకు. భార్య చెప్పినదాంట్లో నిజమేమయినా ఉందేమో ఆలోచించే అవసరమే లేనట్టుంటాడు. పోనీ, ఇరుగుపొరుగు వాళ్ళని చూచయినా బుద్ధి తెచ్చుకుంటాడేమోనంటే అదీలేదు. ఊఁ.. ఎన్నుకొని ఏం ప్రయోజనం? 'చేసుకున్నవారికి చేసుకున్నంత' అని ఊరికే అన్నారా పెద్దలు."

ఊపిరి పీల్చుకోవడానికా అన్నట్లు ఒక్క క్షణం ఆగిందావిడ. నాకిప్పుడర్థమయింది. మన ఆంధ్రోపన్యాసకులవారు తమ సహధర్మచారిణియెడ కించిత్తు అపరాధం చేశారని. ఐతే, ఈ శర్పరంపర ఆయన సమక్షంలో నేనా? లేక ఆయన బయటికెళ్ళిన తర్వాత ఆయనపై యీావిడకున్న ప్రేమానురాగాల్ని ఈ విధంగా ప్రదర్శిస్తున్నదా అన్న అనుమానం నా మస్తిష్కంలో పొడసూపింది. కానీ, అది తీరే మార్గం మాత్రం మృగ్యమైంది.

"అసలీయన్ని ఎలా పెంచారబ్బా ఈయన తల్లిదండ్రులు పెళ్ళయిన యీ మూడేళ్ళనుంచి చెవిలో ఇల్లు కట్టుకుని జోరీగలాగా రొదపెడుతున్నాగానీ ఏమీ విననట్లే ఊరుకుంటారు గదా! పెళ్ళామంటే ఇంట్లో కూడు వండిపెట్టే మరమనిషి అని తప్పితే ఆయన బుర్రలో మరో అభిప్రాయంలేదు."

ఏమిటీ సస్పెన్స్? ఆదివారంగదా ఈ మహాశయుడు ఎక్కడికీ పోడుగదా అని భరోసాతో వచ్చానిక్కడికి కానీ, ఇదేం ఖర్మరా భగవంతుడా! ఈ రోజంతా కూర్చున్నా ఈ ఏకపాత్రాభినయం ముగిసేటట్లు లేదు. అసలీయన ఇంట్లో ఉన్నాడా? లేడా? అదేదో తేలిపోతే నేను నా మిగిలిన పనులు చూచుకుందామంటే అదే తెలియడంలేదు

"ఎన్ని మాటలన్నా నోరు విప్పి ఒక్క మాటయినా మాట్లాడుతాడేమో చూడు. కనీసం పెళ్ళాం మాటకు బదులు చెప్పాలన్న ధ్యాస కూడా లేకుండా ఎట్లా కూర్చున్నాడో కుదుంబిళ్ళలాగా."

విసురుగా ఆమె అన్న మాటలతో నా అనుమానం తీరిపోయింది. ఈ మహాశయుడు ఇంట్లోనే వున్నాడు. కాని ఆయన్ని కలవడమెలా అన్న సమస్యే తీరలేదు. ఏమాట కామాటే చెప్పాలి, భార్య విషయంలో ఈయన ఇంత కినుకు వహించడానికి కారణమేమై ఉంటుందో నాకైతే బోధపడలేదు నిజానికి

# ఉద్యోగం

నేను కూడా ఆమెవైపే వకాల్తా పుచ్చుకొని, 'భార్యను సరిగా చూడండి' అని మన ఆంధ్రోపన్యాసకుల వారికి ఒక సలహా కూడా పారేద్దామనుకున్నాను. నా ఉద్దేశంలో భార్యను నిర్లక్ష్యంచేసే మగాడు మనిషే కాదు.

పాపం! ఆడది. మగవాణ్ణే నమ్ముకుని తల్లిని తండ్రిని, తోడబుట్టినవారిని, ఉన్న ఊరుని వదిలి వస్తుంది అటువంటి స్త్రీమూర్తికి, అటువంటి త్యాగశీలికి కనీస గౌరవమైనా యివ్వని మగవాణ్ణి చూస్తే నాకు వళ్లు మండుకొస్తుంది. చదువులేనివాడైతే సరే! చదువుకున్నవాడేగదా ఈ ప్రబుద్ధుడు. ఆ మాత్రం కూడా తెలియదా ఈనకి. కొంతమంది ఎంత చదువు చదివినా విజ్ఞానాన్ని సంపాదించలేరు. ఈయన కూడా ఆ బాపతే లాగుంది. లేకపోతే ఆ యిల్లాలు అంతగా బాధపడాల్సిన అవసరమేముంటుంది ? 'ధర్మేచా— అర్థేచా—కామేచా— మోక్షేచా — నాతిచరామి' అని వేదమంత్రాలు చదువుతూ కన్యాదానం పుచ్చుకున్నవాడు, వాటిని అర్థంచేసుకునేంతవరకు చదువుకున్నవాడు ఈ విధంగా ప్రవర్తించాడంటే నిజంగా విచారించదగ్గ విషయం. ఇటువంటి మనిషినా ఆ సన్మాన సభలో 'ముఖ్య అతిధి'గా పిలుస్తున్నది. ఛీ...ఛీ... నామీద నాకే అసహ్యం వేసింది. ఆ ప్రయత్నాన్ని మానుకొని వెళితే కమిటీ మెంబర్ల ఆగ్రహానికి గురికావలసి వస్తుందేమోనన్న భయంతో ఊరుకున్నాను.

ఇంతలో, ఆమె డైరెక్టుగా కుండబద్దలైనట్లు మాట్లాడ్డం ప్రారంభించింది. "ఏమండీ! మిమ్మల్నే చివరిసారిగా అడుగుతున్నాను చెప్పండి. ఆ ఉద్యోగంలో నన్ను జాయిన్ చేస్తారా లేదా ?"

హమ్మయ్య! నాకు ఇప్పుడర్థమైందండీ! ఈవిడ బాధ; ఈవిడేదో ఉద్యోగానికి దరఖాస్తు పంపి ఉంటుంది. ఆ ఉద్యోగం ఈవిడకు వచ్చి ఉంటుంది దానికి మన ఆంధ్రోపన్యాసకులవారు అంగీకార ముద్రవేసి ఉండరు.

"ఏమండీ! నా మాట జాగ్రత్తగా వినండి. ఏదో చెబుతున్నానని త్రోసిపారెయ్యకండి. రోజులెలా ఉన్నాయో మీకు తెలియంది కాదు. అన్ని వస్తువుల ధరలు మండిపోతున్నాయి. అంత మాత్రాన మనం పస్తులుంటున్నామని కాదు. నేనా ఉద్యోగంలో చేరి నాలుగురాళ్లు సంపాదిస్తే చన్నీళ్లకు వేన్నీళ్లు తోడు. ఈ రోజు మనమిద్దరమే కావచ్చు. రేపు మనకీ పిల్లలు పుడితే మీ కొచ్చే జీతం మన అవసరాలు తీర్చలేకపోతే, మనం మన పిల్లలు ఏమౌతామో ఒక్కసారి ఆలోచించండి. ఆ ఉద్దేశ్యంతోనే ఇన్ని మాటలు అన్నానుగాని, మిమ్మల్నేదో కించపరచాలని కానే కాదు. త్వరగా నిర్ణయం తీసుకోండి. రేపు ఉదయం పదిగంటలకల్లా ఆ ఉద్యోగంలో జాయిన్ కావాలి. ఆ కంపెనీ చాలా పెద్దదండీ! పైగా ఆ కంపెనీ డైరెక్టరు మా నాన్నగారికి స్నేహితుడు. కాబట్టి అన్ని విధాలా బాగుంటుంది. ప్లీజ్."

ఆమె చెప్పినవన్నీ సబబుగానే ఉన్నాయనిపించింది. మరి, మన ఆంధ్రోపన్యాసకులవారి అభిప్రాయమేమిటో ?

"రాధా!" గంభీరంగా పలికింది ఆంధ్రోపన్యాసకులవారి కంఠం.

"నీవు చెప్పింది కాదనను. కాని, ఒక్క విషయం ఆలోచించు. నాకు వచ్చే జీతంతో మనం తృప్తిగా ఖర్చు చేయడమేగాక కొద్దో గొప్పో వెనకేయగిలుగుతున్నాం. పైగా ధాన్యం యింటి నుండి వస్తాయిగదా! ఇక నీవుకూడా ఉద్యోగం చేసి హైరానా పడవలసిన అవసరం ఏమిటి ? అంతమాత్రాన నేనేదో 'ఆడది ఉద్యోగం చేయరాద'న్న వాదనని సమర్థిస్తున్నానని మాత్రం అనుకోకు. ఆడదికూడా ఉద్యోగం చెయ్యొచ్చు. ఎప్పుడో తెలుసా ? ఆమెకూడా ఉద్యోగం చేసి సంపాదిస్తేతప్ప కాపురం గడవదన్న పరిస్థితి ఉన్నప్పుడు. మనమెన్నో కాపురాలు చూస్తున్నాము. భర్త తెచ్చే సంపాదన చాలక, భార్యకు సంపాదించే అర్హత, శక్తి లేక, ఒకవేళ ఉన్నా ఉద్యోగం దొరక్క, నెలలో కనీసం వారం రోజులైనా పస్తులుంటున్న కాపురాలు ఎన్నోఉన్నాయి. అటువంటప్పుడు మనం అలాంటివారికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రయత్నించాలేతప్ప, మనకి అవకాశమున్నది గదా అని ఉద్యోగాలన్నీ మనమే భర్తీ చేస్తే, ఒకే కుటుంబంలో ఇద్దరు ముగ్గురు సంపాదిస్తుంటే, కొన్ని కుటుంబాలలో అసలు సంపాదించే వారే ఉండని పరిస్థితి కలుగుతున్నది. కొద్దోగొప్పో వెనకేయగలుగుతున్న నీకే ఉద్యోగం మీద ఇంత ఆపేక్ష ఉంటే అసలు తినడానికే తిండి లేక బాధపడుతున్న అనేకానేక మందికి ఉద్యోగం మీద ఎంత ఆశ, కోరిక ఉంటాయో ఒక్కసారి ఆలోచించు. ఐతే, 'ఎంత మంది ఆడవాళ్లు ఉద్యోగం చేయడం లేదు' అని నీవు అడగవచ్చు. కాని, అందరూ ఈ నిర్ణయానికి రావాలి. అత్యవసరమైతే తప్ప ఆడది ఉద్యోగం చేయకూడదు. దీన్ని మనం అవలంబిస్తే దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య కొంతవరకన్నా పరిష్కరింపబడుతుంది. అంతేగాని అన్ని విధాలా అన్నీ ఉన్న నీలాటి వాళ్లే అన్ని ఉద్యోగాలకు తయారౌతూ ఉంటే ఇక నిరుద్యోగ సమస్య తీరడమనేది కేవలం కాగితాలమీదనే నిలిచిపోతుంది. నా ఉద్దేశ్యంలో తప్పని పరిస్థితులలో తప్ప స్త్రీలు ఉద్యోగాల్లో చేరరాదు. నీకు అంత పలుకుబడే ఉంటే మన యింటి ప్రక్కనే ఉన్న సరోజకు ఆ ఉద్యోగం యిప్పించు. పాపం! తండ్రి లేదు. తమ్ముడు చదువుకుంటున్నాడు. ఆ పిల్ల డిగ్రీ వరకూ చదివినా ఉద్యోగం లేదు. వాళ్ల అమ్మ నలుగురి ఇళ్ళల్లో అవీ ఇవీ చేసి ఆ సంసారాన్ని యీడుస్తున్నది. వారానికి కనీసం రెండు రోజులైలా పస్తులుండటం మనం ఎరిగిన విషయమే! అటువంటి కుటుంబానికి మనకు చేతనైన సహాయం చేయడానికి ప్రయత్నించాలేతప్ప, కేవలం మన సుఖమే మనం చూసుకోగూడదు. విద్యావంతులమైయుండీ స్వార్థపరులం కాకూడదు. మనం అలాంటి వాళ్ళకు సాయం చేస్తే వాళ్ళూ సంతోషిస్తారు. దేవుడూ మెచ్చుతాడు. 'మానవసేవే మాధవసేవ' నాకు తెలిసింది, నాకు తోచింది చెప్పాను. అయినా, యిప్పటికీ నీకా ఉద్యోగం చేయాలనే ఉంటే నీ యిష్టాన్ని కాదనను. రేపేవెళ్ళి జాయిన్‌కా!"

గంగా ప్రవాహానికి ఆనకట్ట పడిందా అనిపించేటట్లు ఆగింది ఆ ఉపన్యాసవాహిని.

"ఏమండీ! మీరు యింతటి ఉన్నతమయిన హృదయం గలవారని మీతో కాపురం చేసిన ఈ మూడేళ్ళలోనూ నేను గ్రహించలేకపోయాను. నేనెంత మూర్ఖురాలిని! మీ వంటి అత్యున్నతమైన వ్యక్తికి భార్య కావడం నా పూర్వజన్మ సుకృతం. మీ వ్యక్తిత్వం తెలియక తొందరపాటుతో ఏవేవో మాటలు అన్నాను. నన్ను క్షమించండి. ప్రతి ఒక్కరూ మీలాగే ఆలోచిస్తే నిరుద్యోగ సమస్య తీరడమనేది కేవలం కాగితాల మీదనేకాదు నిజజీవితంలోనూ జరుగుతుంది నేను రేపే మా నాన్నగారితో మాట్లాడి ఆ ఉద్యోగం సరోజకే వచ్చేటట్లు చేస్తాను. నిజం!"

ఆమె మాటలు గాద్గదికంగా ఉన్నాయి. ఆయన చెప్పిన మాటలు నా చెవుల్లో యింకా మార్మోగుతున్నాయి. నిజంగా ఎంతటి వ్యక్తిత్వం! ఎంతటి ఉన్నత హృదయం! ఆహ్వానిస్తే ఇటువంటి వారినే సభలకు ఆహ్వానించాలి. ఇంతటి గొప్ప వ్యక్తిని గురించి ఎంత నీచంగా ఆలోచించాను! ఎంత తప్పు పనిచేశాను. స్వగతంలో అనుకుంటుండగనే అప్రయత్నంగా నా కళ్లు చెమ్మగిల్లాయి. ఇప్పుడు ధైర్యంగా కాలింగ్ బెల్ నొక్కాను. ★

## "దశమ గ్రహం"

నవధాన్యాలు దానం చేస్తే  
నవగ్రహాలు శాంతిస్తాయ్.  
కాళ్లు కడిగి కన్యాదానం చేసి  
కనకవర్షం కురిపించినా  
శాంతించటంలేదు "దశమగ్రహం"

— కుమారి కె. వి. సూర్యలక్ష్మి